క్లుప్తంగా

వేడుకగా గంగమ్మ జాతర

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామంలో ఆదివారం వేడుకగా గంగమ్మ జాతర నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పాలేటి యాగం, బోనాలు, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

జగజ్జనని మాతకు ఆషాడం సారె

నంద్యాల(వ్యవసాయం): స్థానిక జగజ్జననీ దేవాలయంలో ఆషాడమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు అమ్మవారికి సారెను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. మూల విరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారి ప్రతిమను అలంకరించి మేళ తాలలు, వివిధ వేషధారణలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు.

అధికార లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

దొర్నిపాడు: మండలకేంద్రానికి చెందిన కానిస్టేబుల్ సుభాన్ (32) అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందాడు. ఈయన ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం పోలీస్ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ వెంకటరామయ్య, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల సీఐలు రమేష్‌బాబు, నారాయణరెడ్డి, ఉయ్యాలవాడ ఎస్ఐ సత్యనారాయణ, దొర్నిపాడు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి..కుటుంబ సభ్యులను ఓదార్చి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.25వేలు అందజేసి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కే.కొత్తూరులో మంచు మనోజ్



కే.కొత్తూరు రామాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని కే.కొత్తూరులో సినీ హీరో మంచు మనోజ్ ఆదివారం సందడి చేశారు. గ్రామంలోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన తన సతీమణి మౌనికరెడ్డితో కలిసి వచ్చారు. ముందుగా వారు గ్రామంలోని రామాలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతిభతోనే గుర్తింపు



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులకు ప్రతిభతోనే గుర్తింపు లభిస్తుందని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆత్మకూరు సుదర్శన్‌శెట్టి తెలిపారు. ఆదివారం స్థానిక నూనెపల్లె అమ్మవారి శాలలోని వాసవీ కల్యాణ మండపంలో ఐఐటీ, ఇంటర్మీడియెట్, పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు సన్మానం, పారితోషికం అందజేశారు. కాల్వ విజయశేఖర్, అయ్యపుశెట్టి సుబ్రహ్మణ్యం,మారంశేషయ్య, పాలూరి సుబ్బారావు, గుబ్బా రజినీకాంత్, దీక్షిత్ పాల్గొన్నారు.

రెన్యూవల్ గడువు పెంచాలి

గోస్పాడు: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యూవల్ గడువు పొడిగించాలని కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకుడు అబ్దుల్ జబ్బార్ కోరారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర వ్యాప్తంగా 3,618 మంది జనరల్ ఒకేషనల్ గ్రూప్‌లలో పని చేస్తున్నారన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి 12 నెలల కాలానికి రెన్యూవల్ ఉత్తర్వులను సవరించి జీఓ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గోస్పాడు: పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారులుగా నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు భాస్కరరెడ్డి ఎన్నికల పరిశీలకులుగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు సమక్షంలో ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షుడిగా భాస్కరుడు, అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, మహిళ ఉపాధ్యక్షురాలుగా సాజిదా పర్వీన్, ప్రధాన కార్యదర్శిగా సికిందర్ ఆజాద్‌ను ఎన్నుకున్నారు.

గోస్పాడు: ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీలను రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న,ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎంపిక చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నాయుడు, గోస్పాడు మండల గౌరవ అధ్యక్షులుగా శివన్న, గౌరవ సలహాదారులుగా శ్రీనివాసులును ఎంపిక చేశారు. అలాగే గోస్పాడు, యాళ్లూరు గ్రామాల కమిటీని కూడా ఎంపిక చేశారు.

వేంకటేశ్వరుడి వైభవం

- నాడు.. శిథిలమై, ముళ్ల కంపల నడుమ ఆలయం
- నేడు దాతలు, భక్తుల సహకారంతో కోట్లాది రూపాయలతో నూతన కోవెల నిర్మాణం
- సోలార్ దీపాలతో వెలుగులీనుతున్న దేవాలయం
- రుద్రవరం వద్ద వేంకటేశ్వర, మానస లింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణం



నూతనంగా నిర్మించిన లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం



నేడు సోలార్ కాంతుల్లో వెలుగులీనుతున్న నూతన దేవాలయం

రుద్రవరం: ఒకప్పుడు ఆ ఆలయం శిథిలమై..ముళ్ల కంపలతో మూసుకుపోయింది. వేంకటేశ్వరస్వామి ధూపదీప నైవేద్యానికి నోచుకోకపోయారు. పరిస్థితిని గమనించిన అయితే కొందరు భక్తుల సంకల్పంతో స్వామి వారికి నూతన కోవెల నిర్మించి నిత్య పూజలందిస్తున్నారు. భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. ప్రతి శనివారం ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. చెన్నైకి చెందిన కళాకారులతో.. వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన విగ్రహాలు, రాళ్లు, అధునాతన పెయింటింగ్, యాగ శాల, కల్యాణ వేదిక, నవగ్రహాలు, కోనేరు, శ్రీమహాత్రిపుర సుందరి సమేత మానసలింగేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక ఆలయాలను నిర్మించేందుకు నంద్యాలకు చెందిన ప్రముఖ వైద్యుడు హరినాథరెడ్డి దంపతులు ముందుకొచ్చి మరికొందరిని కలుపుకొని కమిటీ ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో కోట్లాది రూపాయలు సమకూరడంతో ఆలయ నిర్మాణం వేగవంతమైంది. జీర్ణోద్ధరణ పూర్తికావడంతో గతేడాది వైభవంగా ఆలయ పునఃప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ఇటీవల ఆ డాక్టర్ దంపతులు, ఆలయ నిర్వాహకులు, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి , మరికొందరి సహకారంతో ఆలయం చుట్టూ, ముఖద్వారం నుంచి ఆలయం వరకు కొత్తగా సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. అలాగే రుద్రవరం-అప్పనపల్లె రహదారిలోనూ కొన్ని సోలార్ లైట్లను వేశారు. ప్రస్తుతం ఆలయం సోలార్ దీపాల కాంతుల్లో వెలుగులీనుతుంది. రాత్రి సమయాల్లోనూ పట్టపగలు అనిపించేలా సోలార్ లైట్లు కాంతులను వెదజల్లుతున్నాయి. ఒకప్పుడు అటు వైపు తిరగాలంటే ప్రజలు జంకేవారు. దారి వెంట శ్మశాన వాటికలు, ముళ్ల పొదలు ఉండటంతో స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చీకటి పడితే ఆ దారిన రాకపోకలు సాగించడానికి సాహసించేవారు కాదు. ప్రస్తుతం ఆ దారిన బీటీ రోడ్డు, సోలార్ కాంతులు ఉండటంతో ప్రజలు నిర్భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. చీకటి పడినా భక్తుల సందర్శన కొనసాగుతోంది. ప్రస్తుతానికి ఆలయం చుట్టూ, ప్రాంగణం, రోడ్డు వెంట మొత్తం 20 సోలార్ లైట్లు వేశామని, మరో 20 లైట్లు రావాల్సి ఉందని, త్వరలో వాటిని కూడా ఏర్పాటు చేస్తామని, ఆలయం నుంచి రుద్రవరం వరకు తారు రోడ్డు వేయిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



నాడు..శిథిలమై, ముళ్ల పొదలతో మూసుకు పోయిన వేంకటేశ్వరస్వామి ఆలయం

ఆపత్కాలంలో అండగా నిలిచాడు..



గోవిందపల్లె వరద బాధితులకు పింఛన్లు అందచేస్తున్న వలంటీర్ మాచర్ల

ఈ చిత్రంలో మోకాటి లోతు నీళ్లలో కూడా పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్ పేరు బత్తుల మాచర్ల. శిరివెళ్ల మండలం, గోవిందపల్లెలో విధులు నిర్వర్తిస్తున్నాడు. 2019 సెప్టెంబర్‌లో మండలంలో 23 సెం.మీ.వర్షపాతం కురిసింది. దీంతో గ్రామంలోని లోతట్టు ప్రాంతాలైన ఎస్సీ కాలనీ, కోళ్లఫారం ఏరియాల్లోని రాత్రికి రాత్రే దాదాపు 534 ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. వీధుల్లో మోకాళ్ల వరకు నీరు ప్రవహిస్తోంది. కట్టు బట్టలతో పేదలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటపడ్డారు. ఆ సమయంలో కట్టుబట్టలు తప్ప తినడానికి తిండి కూడా లేదు. చేతిలో చిల్లి గవ్వ లేదు. ఆ సమయంలో ప్రభుత్వం అందజేసిన పింఛన్లను లబ్ధిదారులకు జోరు వాన, వరద నీటిలో ఇంటింటికీ తిరగడమే కాకుండా వివిధ ప్రాంతాల్లో తలదాచుకున్న వారికి పింఛన్ సొమ్ము అందజేశాడు. అలాగే గ్రామ పెద్ద ఇందూరి ప్రతాపరెడ్డి వరద భాధితులకు వారం పాటు అన్నదానం చేశారు. ఆ కార్యక్రమంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరించారు. ఇంటింటికీ వెళ్లి పరామర్శించడమే కాకుండా సొంతవారిలా చూసుకున్నారు. అలాగే కరోనా సమయంలో సలహాలు సూచనలు ఇవ్వడమే కాకుండా టీకాలు కూడా దగ్గరుకుండి వేయించాడు. వారి సేవలను నాడు గ్రామస్తులు అభినందించారు. ప్రభుత్వం వజ్ర పురస్కారంతో సత్కరించింది. – శిరివెళ్ల

వలంటీర్ల సేవలు అమూల్యం



నేను వితంతువును. మా గ్రామంలో మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి మా ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. కట్టుబట్టలతో ప్రాణాలు కాపాడుకోవడానికి బయటకు పరుగులు తీశాం. చేతిలో డబ్బులేదు. తినడానికి తిండి లేని సమయంలో మా వలంటీర్ మాచర్ల మా వద్దకు వచ్చి పింఛన్ అందజేయడమే కాకుండా దాతల సహకారంతో అన్నదానం చేశాడు. తాను దాదాపు రోజంతా మా సేవల్లోనే గడిపేవాడు. వారిని ఎంత పొగిడినా తక్కువే. ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు తలపెట్టినా ఇప్పటికీ మా ఇళ్లకు వచ్చి అన్ని వివరించి మేం అర్హత పొందేలా చూస్తున్నాడు. చివరకు టీకాలు కూడా వేయించి వెళ్తున్నాడు. కరోనా సమయంలో కూడా అండగా నిలిచాడు. ఎంత అర్ధరాత్రి అయినా పిలిస్తే పలుకుతాడు. – చెన్నమ్మ

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేక అభిషేకాల అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి విశేష పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారికి చీర, సారె, పిండివంటలను నైవేద్యంగా మొక్కులు చెల్లించుకున్నారు.

ఆ పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంగాధర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థలో దేశంలో ఎన్నో అభినందనలు అందుకుందని, అలాంటి వ్యవస్థపై ఆరోపణలు, విమర్శలు చేస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం చాగలమర్రిలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్నారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగాధర్‌ను ఆయన స్వగృహంలో పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రశంశలు కురిపిస్తుంటే, మన రాష్ట్రంలో ఉన్న నాయకులు గుర్తించకపోగా, ఆరోపణలు చేసి రాష్ట్రం పరువు తీస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో పథకాలు పొందాలంటే ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రజలకు తెలుసునని, మీరు పారదర్శకంగా వ్యవహరిస్తున్న వ్యవస్థను తప్పుబట్టడాన్ని చూస్తే ఆకాశం వైపు ఉమ్మి వేసినట్లేనని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఎన్ని గిమ్మిక్కులు ప్రదర్శించినా ప్రజలు నమ్మరని, మీకు ఈ సారి నామరూపాలు లేకుండా చేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రజల వద్ద నిజాలు ఒప్పుకొని క్షమాపణలు కోరితే వారికి మీపై కాసింతైనా కోపం తగ్గుతుందన్నారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గణేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ముల్లా.రఫీ, సర్పంచ్ బంగారు షరీఫ్, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్‌సోహెల్, మాజి సర్పంచ్ రమణారెడ్డి, రామగుర్విరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై ప్రత్యేక కమిషన్ వేయాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

నంద్యాల(న్యూటౌన్): మహిళా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులు లేకుండా చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తుందన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28 నుంచి ఆగస్టు 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జీపు జాత నిర్వహిస్తామని తెలిపారు. ఆగస్టు 5న నంద్యాలలో సభ, 8న విజయవాడలో భారీ బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 17న ఢిల్లీలో ధర్నా చేస్తామన్నారు. షమీమ్‌బేగ్, హైమావతి, రంగమ్మ, భాను, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రహదారి సమస్యకు పరిష్కారం చూపండి



సమస్యను ఎంపీ పోచాకు చూపుతున్న స్థానికులు

నంద్యాల(అర్బన్): నూనెపల్లె ఫ్లై ఓవర్ కింది రహదారికి తక్షణ పరిష్కార మార్గం చూపాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తెలిపారు. రహదారిని రైల్వే అధికారులు మూసివేయడంతో పట్టణానికి వచ్చే ప్రజలతో పాటు స్థానిక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారంటూ ఎంపీ పోచాకు ప్రజలు వివరించారు. స్పందించిన ఎంపీ ఆదివారం ఫ్లై ఓవర్ వంతెన వద్దకు వచ్చి పరిస్థితులను పరిశీలించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి రహదారికి ప్రస్తుతం తక్షణ పరిష్కారం చూపాలని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణకు ఫోన్‌లో వివరించారు. శాశ్వత పరిష్కారానికి రెండు మూడు రోజుల్లో రహదారి సమస్యను పరిష్కరిస్తామంటూ ఎంపీకి హామీ ఇచ్చారు. ఎంపీ వెంట చిరు వ్యాపారుల సంఘం, ఆటో యూనియన్ నాయకులతో పాటు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ అనిల్ అమృతరాజ్ పాల్గొన్నారు.

పాస్టర్‌కు సన్మానం

నంద్యాల(అర్బన్): నంద్యాల డయాసిస్ పరిధిలోని పాస్టరేట్–5 టెక్కె క్రైస్ట్ చర్చి పాస్టర్ రెవ శ్యాం దేవ దానం బాబు గోస్పాడు మండలం సాంబవరం చర్చికి బదిలీ అయిన సందర్భంగా నూతన పాస్టర్ రెవ సుమిత్ర బాబు చర్చి సెక్రటరీ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం చర్చిలో జరిగిన కార్యక్రమంలో రెవ.దేవదానం బాబు దంపతులను పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. బాలచంద్రుడు, ప్రసాద్, ప్రభుదాసు, పుష్పలత పాల్గొన్నారు.



ప్రకృతి గీసిన చిత్రం

ప్రకృతి గీసిన చిత్రాలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. ఎంతో చేయి తిరిగిన చిత్రకారుడు సైతం ఆశ్చర్యపోయేలా గోచరిస్తాయి. ఆదివారం సాయంత్రం పొద్దుగూకే సమయంలో దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు శివారులోనున్న కుందూ నది ఎంతో అందంగా ఆవిష్కృతమైంది. నదిలో నీరు లేక కనిపిస్తున్న రాళ్లు, పైన ఆకాశంలో నల్లటి మబ్బులు, సమీపంలోని చెట్లు.. క్యాన్‌వాస్‌పై గీసిన చిత్రంలా అగుపించింది. – దొర్నిపాడు

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

శిరివెళ్ల: చెన్నూరుకు చెందిన షేక్ మదార్‌షా (48) చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ సురేష్ ఆదివారం తెలిపారు. ఈ నెల 14న పురుగు మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం నంద్యాల వైద్యశాలకు తరలించగా అక్కడ పరిస్థితి విషమించింది. వైద్యుల సలహా మేరకు కర్నూల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడన్నారు. తన భర్త కౌలుకు పొలం తీసుకొని వ్యవసాయం చేసి అప్పుల పాలయ్యాడని బాధ తట్టుకోలేక మృతి చెందాడని భార్య రహమ్మబీ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ స్పష్టం చేశారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అయితే సచివాలయాల పరిధిలో సమస్యలు పరిష్కారం కాని వాటిని మాత్రమే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో అర్జీ అందజేయాలని కోరారు.

నేడు ‘గడప గడపకు మనప్రభుత్వం’

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో సోమవారం సాయంత్రం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుబ్బారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వీడాలి

నంద్యాల(సెంట్రల్): ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది ప్రాధాన్యమివ్వాలని జిల్లా పట్టు పరిశ్రమ శాఖాధికారి, శ్రీశైలం నియోజకవర్గ ప్రత్యేకాధికారి పరమేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయస్థాయిలో పరిష్కారమవ్వాల్సిన సమస్యలు సైతం నేరుగా కలెక్టర్ వరకు రావటం ఆక్షేపణీయమన్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా.. కొంత మంది సిబ్బందిలో మార్పు రావటం లేదన్నారు. కలెక్టర్ స్పందనలో భాగంగా మండలాధికారులతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయ పీఎస్, సంక్షేమ కార్యదర్శులు సైతం జూమ్ విధానంలో పాల్గొనాలని సూచించారు. ఏదైనా ఫిర్యాదుపై వాకబు చేసేందుకు కలెక్టరు నేరుగా సంబంధిత సచివాలయ సిబ్బందితో జూమ్ ద్వారా మాట్లాడతారని, ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం ముగిసే వరకు జూమ్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు దండె దస్తగిరి ఆధ్వర్యంలో ఆదివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. దస్తగిరి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు రోటరీ క్లబ్ సహాయం చేస్తుందని చెప్పారు. పుస్తకాల పంపిణీకి సహకారం అందించిన రోటరీ క్లబ్ పీడీజీ కందుకూరి శ్రీరామమూర్తిని అభినందించారు. పీడీజీ రామలింగారెడ్డి, మోహన్‌రెడ్డి, విశ్వనాథ్, సుబ్బరామయ్య, కళామురళీ, నాగరాజరావు, రాజశేఖర్, సత్యనారాయణ, కైలాసనాథరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగస్టు 9న మహాధర్నా

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 9న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాసులు,కోటయ్య, మద్దయ్య, ప్రతాప్, సుశీలమ్మ, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర దేవస్థానంలో స్వామి వారి నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి వారికి పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, బిల్వార్చన, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం జరిపించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ నాగప్రసాద్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో నంద్యాల జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బత్తుల రవికుమార్ మాట్లాడుతూ నూతనంగా పదోన్నతి పొందిన హెచ్‌ఎంలు, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈఓలు సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, వీరరాఘవయ్య, శివకుమార్, శంకర్, సుధాకర్, క్విట్ ఇండియా జిల్లా కో ఆర్డినేటర్ విశ్వనాథ్, సన్మాన గ్రహీతలు ప్రతాపుడు, మౌలానీ, శశికళ,బాలు, అశోక్‌రెడ్డి, బాబు, ప్రతాప్ పాల్గొన్నారు.